# స్వగతంలో మా అమ్మ

కట్టా గోపాలకృష్ణ మూర్తి

మా పూర్వీకులు చేనేతగాళ్ళు, తరతరాలుగా ఈ వృత్తి మీదే ఆధారపడి పందిళ్ళపల్లి అనే గ్రామంలో నివసించే వారు. ఈ ఊరు ప్రకాశం జిల్లాలో ఉంది. 20-వ శతాబ్దపు మొదటి భగంలో ఊళ్ళో వీళ్ళే మెజారిటీ గనుక, పందిళ్ళపల్లిని చేనేత గ్రామంగా పరిగణించేవారు. ఈ చేనేత కుటుంబాలను సపోర్టు చేస్తూ వర్తకులు (ఊరిలో కొట్లు నడిపే వాళ్ళు) ఊరి ముఖ్యవీధిలో నివసిస్తూ ఉండేవారు. వీళ్ళే కాక భుస్వాములు (కాపులు, రెడ్లూ), ముఖ్యవీధిమీద నివసిస్తున్న కొందరు బ్రాహ్మణులు, యానాదిపేటలో యానాదులూ, మంగలి వాళ్ళూ; ఇతర పేటల్లో కొంత మంది మిగిలిన వృత్తులవాళ్ళూ ఉండేవారు.

20-వ శతాబ్దంలో ఆధునికీకరణం మూలాన చాలామంది మా ఊరిప్రజల జీవనాలలో చాలా మార్పులు వచ్చాయి. ఊళ్ళో ఈ మార్పులకు మా కుటుంబమే మొదటి నిదర్శనం. ఈ వ్యాసంలో మా అమ్మ జీవితాన్ని గురించి తను చెప్పిన విషయాలతో, తన జీవితం మా పూర్వీకుల జీవితాలనుంచి ఎంత మారిపోయిందో వివరించి; ఆ కాలంలో ఊరి ప్రజల జీవనాలలో కనబడే సాధారణ ఆచారాలు వర్ణిస్తాను.

## 1. పందిళ్ళపల్లి ఊరు, ఊరి పరిసరాలు, ప్రజల ఆచారాలు

### 1.1 ఊరిలో పంటలు

పందిళ్ళపల్లి ఊరి నేలంతా తెల్లటి ఇసక పర్ర. అప్పుడు ఊరిలో సాగునీటికి నదులు, పెద్ద చెరువులు ఏవీ లేవు దగ్గర్లో. అందువల్ల మెట్టపంటలు (జొన్న, మొక్కజొన్న, మిరప, పెసలు, మినుములు, నువ్వులు, పిల్లిమిసర, తైదులు, తమలపాకులు, కొయ్య తోటకుర) పండించేవారు. ఈ పంటలకు నీటికని ఇసకలో సొనలు తవ్వారు. సొన అంటే ఒక పొడుగాటి, షుమారు 15 అడుగులు వెడల్పు గల, లోతు గొయ్య. భుమిలో నీళ్ళు తగిలేవరకూ తవ్విన గొయ్య. కుండలతో

సొనలోని నీరు పైకి మోసుకువచ్చి పంటలకు పోసేవారు. ఈ సొనలు పూడిపోకుండా వాటి చుట్టూరా మొగలి మొక్కలు నాటారు. ఈ పంటలే కాకుండా ఊరిలో చాలా మామిడి, జీడిమామిడి తోటలు ఉండేవి. ప్రకృతి సహజంగా వచ్చిన అత్తి చెట్లు, తాటి చెట్లు, రకరకాల బెర్రీలు కాసే పొదలు పెరుగుతూండేవి. ఊరి బయట సరిగి తోటలు పెంచే వారు.

సొనల దగ్గర మొగలి చెట్లు కొంతకాలానికి బాగా విస్తరించి ఊరికి ప్రకృతి సౌందర్యాన్ని ఇచ్చేవి. స్త్రీలు మొగలి పువ్వులు తలలో పెట్టుకునేవారు. యానాది వాళ్ళు మొగలి పువ్వులూ, అత్తి కాయలూ, పేపపళ్ళూ, చిట్టి ఈత కాయలూ, ఈత పళ్ళూ, తాటి ముంజెలూ, తేగలూ తెచ్చి కూరగాయల మార్కెట్టూ దగ్గర అమ్ముకునే వారు.

1.2: ఊరిలో గుళ్ళు, దేవతలు, వారికి జరిపే పూజలు

ఊరికి దగ్గరలో పందిళ్ళమ్మ దేవత గుడి ఉండేది. ఊరి పేరు ఈ గ్రామదేవత నుంచే వచ్చింది. ఊర్లోనే రామలింగేస్వరస్వామి, ఆయన భర్య చౌడేస్వరిదేవిలకు గుడి ఉండేది..

గ్రామాధికార్లుగా ముగ్గురు ఊరిపెద్దలుండేవారు, వారిలో గుత్తి రామయ్యగారు (మా అమ్మ తాత గారు) ఒకరు. ఊరిలో మంచి, చెడులన్నీ వీళ్ళే నిర్నయించే వారు, గ్రామ సమస్యలన్నీ ఈ ముగ్గురే పరిష్కస్రించే వారు.

చౌడేస్వరి దేవికి విగ్రహం లేదు. ఆవిడ రూపంగా బియ్యప్పిండి చలిమిడితో దీపారాధన కుండీ చేశి, నెయ్యి పోశి, దొర్లో వత్తి పెట్టి వెలిగించి, ఈ దీపంలోనే చౌడేస్వరి దేవిని ఆవాహన చేశి, ఆ జ్యోతియే చౌడేస్వరి దేవి రూపంగా పూజించేవారు.

ప్రతి సంవత్సరం ఒకసారి చౌడేస్వరిదేవికి సంబరాలు జరిపించేవారు. ఈ సంబరాలకు ముహూర్తం ఊరి పెద్దలు ముగ్గురూ కలిశి నిర్ణయించేవారు. ఈ సంబరాలలో చౌడేస్వరి దేవికి మేకను బలి ఇచ్చేవారు. బలి ఇచ్చేముందు ఆలయ ఆవరణలో ఈ మేకను ఒక కర్రకు కట్టేశి నిలబెట్టేవారు. దాని చుట్టూరా ప్రజలు గుమిగూడి దానిమీద రాళ్ళూ, కర్రలూ విసిరి, దానికి రక్తంకారే గాయాలు కల్గించేవారు. చిన్నతనంలో ఇది చూశినప్పుడు , మిగతాజీవులమీద మానవక్రూరత్వం గురించి నాకు కనువిప్పు కల్గింది.

చౌడేస్వరి దేవికి మానవరక్తం ఇష్టమని ప్రతీతి. అందుకని ఆవిడ సంబరాలలో ఒక రోజు మగ భక్తులు పరాకు చేశేవారు:. అంటే ఈ భక్తులు కత్తితో తమ శరీరాలను (ముఖ్యంగా చాతీ మీద) రక్తం కారేట్లు పొడుచుకునేవారు. ఇలా పొడుచుకుంటూ, ``పరాక్, బహుపరాక్'' అని అరుచుకుంటూ, చౌడేస్వరి గుడిముందు రోడ్డు మీద ఆవిడ జ్యోతిని బండిమీద పెట్టి ఊరేగించేవారు.

ఆ రోజుల్లో మానవ జన్మకు, భుక్తి, ముక్తి, మాత్రమే కర్తవ్యాలుగా పరిగణించేవారు.
మా ఊరు ప్రజలలో చాలామందికి భుక్తికే కాలమంతా సరిపోయేది కనుక, వీళ్ళకు పండుగరోజుల్లో తప్పించి, ముక్తిని గురించి ఆలోచించడానికి కాలం దొరికేదికాదు.

1.3: భోజనాచారాలు

ఊరిలో ప్రజలంతా పెద్ద పెద్ద సమిష్టి కుటుంబాలలో నివసించేవారు. ఈ పెద్ద కుటుంబాలలో వంటకు బియ్యం పెద్ద కట్టెపుల్లల పొయ్యిలో ఉడకబెట్టి, గంజి వార్చి, అన్నం చేసుకునేవారు. గంజితో ''పుణ్ణీళ్ళు'' చేసుకొని దాన్ని మరుసటిరోజు తినేవారు. అందరూ రోజుకి 3 సార్లు భోజనం చేశేవారు. వంటల్లో ముఖ్యంగా రోజూ వండేది కొయ్యతోటకూరలో చింత పండు రసం వేశి చేశిన ''పుల్లతోటకూర''. ఈ పుల్లతోటకూరా, గుండ్రటి వంకాయకూర సాధారణంగా రోజూ ఉంటాయి. దొరికినప్పుడు బీరకాయ, సొరకాయ కూరలు; పంతకాలంలో పచ్చి జీడి గింజలకూరా ఉంటాయి.

పొద్దున్న బ్రేక్F ఆస్టుకు పున్నీరు, చద్దన్నం వెల్లుల్లికారంతో తినేవారు. పండుగలకు ముఖ్యంగా బియ్యంపిండి, బెల్లంతో అరిసేలు వండుకునేవారు. శ్రీరామనవమి పండుగకు వడపప్పు (నానబెట్టిన పెసరపప్పు), బెల్లంపానకం మధ్యాన్నానికి; రాత్రికి పెసలవడల పులుసు చేసుకునేవారు.

1.4: స్త్రీల పూజలు

స్త్రీలు చాలా నోములు నోచుకునేవారు. నాగులచవితి, అట్లతద్దె, కార్తీక పౌర్ణమి; శ్రావణమాసంలో వరలక్ష్మి నోము, ఘనంగా జరిపేవారు.

ఆ కాలంలో ఊరు రైలు కట్టకు ఒక వైపునే ఉండేది.  నాగులచవితికి ఊరు బయట రైలుకట్టకు అవతలివైపున ఉన్న పాములపుట్టల్లో పాలుపోశి, పుట్టల కంతల్లో పెసరపప్పూ, చలిమిడీ పెట్టి పూజచేశి; అక్కడే ఆ రోజు వంట చేశుకొని వనభోజనంలా తినేవారు.

మిగతా నోములన్నీ ఇంట్లోనే జరుపుకునేవారు. అట్లతద్దిరోజ గౌరీపూజచేసి స్త్రీలందరూ ఉయ్యాలలూగేవారు. ఊళ్ళో రంగులరాట్నం పెట్టి, దాంట్లో స్త్రీలనూ, పిల్లలనూ ఊగించేవారు.

కార్తీక పౌర్ణమి రోజున కేదారీస్వరుడి పూజ చేసేవారు. 21గారెలూ, అరిశెలూ, మర్రిఆకులూ, పసుపుకొమ్మలూ, తమలపాకులూ, వక్కలూ పెట్టి, చెంబుమీద నిండు కొబ్బరికాయనుపెట్టి దానిని కేదారీస్వరుడి రూపంగా భవించి పూజచేశేవారు. ఆ రోజు రామలింగేస్వర స్వామి గుళ్ళో, గుడి పైనా, చుట్టూరా, ప్రమిదలు వెలిగించి సంబరం చేశేవారు. కొన్ని దీపాలు గాలికి ఆరిపోయేవి, మిగతావి నూనె అయిపోయేంతవరకూ రాత్రి వెలుతూ ఉండేవి.

శివరాత్రికి ''ఏకాహం''  అనే పేరుతో అంచెలు అంచెలు గా ''ఓం నమశ్శివాయ" మూడు నుంచి అయిదు రోజుల వరకూ రాత్రింబవళ్ళూ జపించేవారు. ఈ జపం అయ్యాక ఊర్లో అందరికీ సంతర్పణ చేశేవారు.

ఇలానే శ్రావణ మాసంలో వరలక్ష్మి నోముకు ఒక ముత్తైదును ఇంటికి పిలిచి, ఆవిడను లక్ష్మీదేవిగా భావించి, భోజనం పెట్టి, జాకుట్టు గుడ్డా, పళ్ళు, తాంబూలం ఇచ్చి నమస్కారం పెట్టి, అప్పుడు విందు చేసుకునేవారు.

ఇంకొక రెండు ముఖ్యమైన పండుగలు ఉన్నాయి. వీటిలో ఒకటి ఆయుధ పూజ.  ఆ రోజు పురుషులు తమకు జీవనోపాధి కల్పించినందుకు తమ మగ్గాలను పూజిస్తారు. స్త్రీలు, తమను తల్లులుగా  చేశినందుకు తమ పురుషులను పూజిస్తారు.

కోస్తాలో ఉన్న గ్రామం కనుక ప్రతి సంవత్సరం అందరూ సముద్ర స్నానం పండుగ రోజున సముద్రస్నానానికి వెళ్ళేవారు. సముద్ర తీరం 3 మైళ్ళ దూరంలో ఉంది ఊరుకు, దీనికి బండి కట్టించుకొని,  సూర్యోదయనికి బాగా ముందే బయల్దేరతారు. ఆ రోజు, స్త్రీలు మాత్రం అర్ధరాత్రే లేచి, వంట పూర్తి చేసుకొని, దాన్ని గిన్నెల్లో సర్దుకొని బందిలోపెడ్తారు బయల్దేరే ముందు. తీరం చేరిన వెంటనే సముద్ర స్నానం చేశి, సముద్రాన్నీ, ఉదయ భానుడినీ పూజించేవారు. ఇవి అయ్యాక బండిలో తిరుగు ప్రయాణం మొదలుపెట్టి, మధ్యలో పాడుపడిన రాముడి గుడిలాంటి చోట్లలో ఆగి, ఆ గుడి మంచి నీటి భావిలో నీళ్ళు చేదుకొని ఉప్పు శరీరాన్ని కడుక్కొని స్నానం చేశేవారు.  అప్పుడు తెచ్చుకున్న వంటకాలు వనభోజంలా భుజించి, ఇంటికి నెమ్మిగా చేరుకునేవారు.

1.5: స్త్రీల దిన దిన కార్యక్రమాలు

అన్న ఇళ్ళల్లోనూ వంటంతా పుల్లల పొయ్యిల మీదే జరిగేది. ప్రతిరోజూ బ్రేకుఫాస్టు తర్వాత ఇంటిలోని స్త్రీలు గుంపులుగా కంపకు వెళ్ళేవారు. ''కంప'' అంటే పొయ్యికి
వాడడానికి సేకరించిన సరిగి కొమ్మల మోపు. దీన్ని తలమీద పెట్టుకొని ఇంటికి మోసుకు తెచ్చుకునేవారు. ప్రతి ఇంటిలోనూ కనీసం రెండు రోజులకొకసారి కంప తెచ్చుకుంటే గానీ వంట చేసుకోడానికి పుల్లలుండవు కదా. కంపకు వెళ్ళడానికి స్త్రీలు చెప్పులు వాడేవారు కాదు. ఇదేకాక ఆ సరిగి తోటల యజమాన్లు ఈ స్త్రీలు తమతోటలో కొమ్మలు తుంచుకోడం చూస్తే వాళ్ళను తిట్టి బయటకు గేంటేశేవారు. అందుకని భయం భయంగా, దొంగచాటుగా, గబగబా కొమ్మలమోపు చేసుకొని బయట పడడానికి ప్రయత్నించే వారు ఈ స్త్రీలు.

చేనేత కుటుంబాలలో పురుషులు నేతనేశేవారు మగ్గాలలో కూర్చొని. దానికి నూలు తయారుచెయ్యడం, ఇచ్చెలు తోడడం, కండెలు చుట్టడం మొదలైన పనులు స్త్రీల భాద్యతగా ఉండేది. ఈ పనులతోనూ, వంటా, కంపతేవడం పనులతో స్త్రీలు చాలా బిజీగా ఉండేవారు. ఆడపిల్లలు పెద్దవాళ్ళయ్యాక తమకుటుంబానికి ఎలానూ ఈ పనులు చెయ్యాలి గనుక, వారికి పెద్ద చదువులు అనవసరం అని పెద్దలు అనుకునేవారు. అందుకనే ఆడపిల్లలు ఎలిమెంటరీ స్కూలు పైన చదువులకు వెళ్ళడం చాలా అరుదుగా ఉండేది.

ఇళ్ళకు ఎలాంటి నీటి సరఫరా ఉండేదికాదు ఆ రోజుల్లో. నీళ్ళకు ఊరిలో 2, 3 పెద్ద బావిలు ఉండేవి. వీటిలో నీరు చప్పగా ఉంటాయి కనుక త్రాగడానికి పనికిరావు. ఈ బావులకు కుండలతో వెళ్ళి, బొక్కెనతో నీళ్ళు చేదుకొని, కుండల్లో పోసుకొని, స్త్రీలూ, ఎదిగిన ఆడపిల్లలూ, తెచ్చేవారు, ఇంటిపనులకు. తాగడానికి గుడి దగ్గర ఒక బావిలోనే తీపినీరు లభించేది. ఆ బావినుంచి తాగేనీరు వేరుగా తెచ్చేవారు.

రోజూ బ్రేక్ఫాస్టు తర్వాత స్త్రీలు తమపనుల్లోనూ, మొగవాళ్ళు నేతలోనూ దూరిపోయేవారు. ఖనుక పెద్దలకు పండుగరోజుల్లోనూ, నేతపనుల మధ్య ఉండే ఊరట సమయంలోనూ తప్పించి ఎక్కువ ఖాళీ ఉండేదికాదు.

1.6: ఊరిలో స్కూలు

ఊరిలో, 4-వ తరగతి వరకూ చెప్పే ఎలిమెంటరీ స్కూళ్ళు ఆడపిల్లలకూ, మగపిల్లలకూ వేరు వేరుగా ఉండేవి. వీటిలో తెలుగు మాత్రమే నేర్పేవారు. పైచదువులకూ, ఇంగ్లీషు చదువుకోడానికీ, ఊరికి 2 నుంచి 10 మైళ్ళ దూరంలో ఉన్న వేటపాలెం, చీరాల, బాపట్ల వెళ్ళాలి.

ఆడ మగ పిల్లలు ఎప్పుడూ కలిసి ఆడుకునేవారుకాదు

ఆడ పిల్లలు సాధారణంగా తొక్కుడుబిళ్ళ, అచ్చినికాయ ఆటలు ఆడుకునేవారు. తొక్కుడు బిళ్ళకు నేలమీద ముగ్గుతో బొమ్మవేశి, దానిమీద ఆడతారు. అచ్చినికాయ 5 గింజల తో (సాధారణంగా కుంకుడు లేక చింత గింజలు)తో ఆడే ఆట.

### 1.7: కొన్ని పురుషుల అలవాట్లు

ఊర్లో ఉన్న తాటి చెట్లనుంచి కల్లు చేశేవారు. వాటిని అమ్మే కొట్లు రెండు ఉండేవి. ఊర్లో కొంతమంది యువకులూ, పురుషులూ కల్లుకి బానిసలయ్యి, కుటుంబాన్ని పోషించే పనులు చేశేవారు కాదు. దీని మూలాన వాళ్ళ కుటుంబాలు వాళ్ళను కల్లు మానెయ్యమని తెగ సాధిస్తూ ఉండేవారు.

### 1.8: వినోద కార్యక్రమాలు

ఊర్లో కాని, ఊరికి దగ్గర్లో కానీ, సినిమాహాలు ఉండేదికాదు. సినిమా చూడాలంటే, ఊరుకి 7 మైళ్ళ దూరంలో ఉన్న చీరాలకు వెళ్ళాలి. ఊరి ప్రజలు నేత కట్టేశిన పండుగరోజుల్లో చీరాల సినిమాలకు వెళ్ళేవారు.

అప్పుడప్పుడూ ఊరికి గుడారం సినిమా వచ్చేది. కొన్నాళ్ళు ఆడాక వీళ్ళు గుడారం కట్టేశీ, ఇంకో ఊరి వెళ్ళిపోయేవారు.

ఊర్లో నాటకాలు వేశేవారు, వాటిని చూడడానికి టిక్కెట్లు పెట్టేవారు. మా అమ్మ చిన్నాన్నలు ఇద్దరు ఈ నాటకాలలో దుర్యోధనుడు, కృష్ణుడు వేషాలు వేశేవారు. మా అమ్మ ఎప్పుడూ చీరాలలో సినిమాకు వెళ్ళలేదు కానీ, ఊర్లో నాటకాలు అన్నీ చూసేది.

### 1.9: స్త్రీల ఆరోగ్య సమస్యలు

ఆ రోజుల్లో వయస్సుల్లో ఉన్న స్త్రీలు చాలామంది కాన్పు సమయంలో మరణించేవారు. దీన్ని వల్ల విధురులైన వారి భర్తలు మళ్ళీ పెళ్ళి చేసుకునేవారు. ఇలా ఊరిలో చాలామంది పురుషులు 2-వ, లేక 3-వ భార్యతో కనిపించేవారు.

మా ఊరిలో చనిపోయినవారి శవాలను పాతిపెట్టేవారు. సొంతస్థలంలో పాతిపెట్టితే డబ్బున్నవాళ్ళు దానిపై సమాధి కట్టించుకునేవారు. ఊరిలో చాలాచోట్ల ఈ సమాధులు కనిపిస్తాయి.

### 1.10: ఇతర సమస్యలు

ఆ కాలంలో పంటలు కోశాక, కాపుని పొలంలో ఎండబెట్టే [illegible]వారు. ఆది ఎండాక, ధాన్యాన్ని బస్తాలలో పోశి దాచేవారు. ఒక్కోసారి ధాన్యం ఎండ[illegible]క వర్షం వచ్చి అది తడిసిపోయి చెడిపోయేది. వారికి ఇలా జరిగితే వెంటనే బియ్యంకు కరువు వచ్చేది. అప్పుడు అంతా జొన్న అన్నం, తైదుపిండితో చేశిన రొట్టెలు కాల్చుకొని తినేవారు.

సముద్రందగ్గర మళ్ళు కట్టి, వాటిలో సముద్రజలాన్ని ఎండబెట్టి ఉప్పు చేశేవారు. ఇలా చేశిన ఉప్పునే ఊర్లో వాడేవారు.

11 సంవత్సరాలలోపు వయస్సు పిల్లలకు ``చంటిబిడ్డగుణం'' అనే జబ్బు వచ్చేది. ఆరోగ్యంగా ఉన్న పిల్లాలే అకస్మాత్తుగా కళ్ళు తేలేశి, కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ, నోటిలో నుర్రగతో మూర్చ వచ్చినట్లు పడిపోయేవారు. దానికి ఏమీ మందు ఉండేదికాదు. కొంతమంది అప్పుడు పేషెంటు నుదుటిమీద కాల్చేవాళ్ళు. ఊర్లోని ఆయుర్వేద డాక్టరు పేషెంటు చేతిలో తాళాంచెవి పెట్టీ, ముక్కులో జిల్లేడు ఆకుల రసం పోయించేవాదు. సాధారణంగా అరగంట తర్వాత పేషెంట్లకు మళ్ళీ స్పృహ వచ్చి మామూలుగా అయిపోయేవారు.

ఆ కాలంలో ఇంటిపనులకు పనిమనుస్యులను పెట్టుకునేవారు కాదు. ఊరి దగ్గర్లో పిండిమర లేదు, అందుకని బియ్యంపిండికి బియ్యం దంచుకునేవారు. ఇలా ఇంట్లో స్త్రీలకు చాలా పనులుండేవి. చిన్నవయస్సులోనే ఆడపిల్లలు స్కూలు నుంచి వచ్చాక తల్లికి అంట్లు కడగడం, బియ్యం దంచడం వగైరా పనుల్లో సహాయం చేశే వారు.

1.11 ఊరి ఆర్థిక స్థితి అభివృద్ధి

ఊరిదగ్గర్లోకి పంటకాల్వలు 1950 తర్వాతనే వచ్చాయి. దీనివల్ల ఊరి ప్రజలకు ఎంతో మేలు జరిగింది. కానీ దురదృష్ట వశాత్తూ, ఈ పంటకాల్వలు వచ్చాక, ఎన్నో రకాల బెర్రీ చెట్లు, పొదలు అన్నీ నరికేశి, అవి ఉండే స్థలాలను వరిపొలాలుగా మార్చేశారు. దీనివల్ల మానవజనాభా పెరగడానికి అవకాశం కల్గినా, ఆ మొక్కలన్నీ extinct అయిపొయ్యాయి.

2. పెళ్ళి ముందు మా అమ్మ జీవనం

ఘ్రుత్తి రామయ్యకు కూతుర్లు లేరు, మొత్తం 6-గురు కొడుకులు. వీళ్ళకు పక్క ఇంటి ఆయనను అంతా బాదంచెట్టాయన అని పిలిచే వారు, ఆయనకు మొగపిల్లలు లేరు. అందుకని ఆయన రామయ్య కొడుకు కోటనాగులుని దత్తత తీసుకున్నాడు. ఆ రోజునుంచీ ఈ అబ్బాయిని ``బాదంచెట్టు కోటనాగులు'' అని పిలవడం మొదలుపెట్టారు.

మిగతా 5-గురు రామయ్య కొడుకులూ తమ కుటుంబాలతో కలిసి ఒక సమిష్టి కుటుంబంగా 3 ఇళ్ళల్లో నివసించేవారు. అందరికీ ఒక్కటే వంటగది. వీళ్ళంతా కలిసి ``రామయ్య & సన్స్'' అనే కంపనీ నడిపేవారు. ఈ కంపెనీ చేనేతగుడ్డలు ఊరిలో నేయించి ఆఫ్రికాకు ఎగుమతిచేసేది.రామయ్య కుటుంబంలో అందరూ ఈ పనిలోనే కృషి చేస్తూ ఉండేవారు. ఇంట్లో తరచూ నూలు, గుడ్డ రంగులు వెయ్యడం, గుడ్డ అద్దకం చెయ్యడం జరుగుతుండేది.

1920-లో రామయ్య మూడవ కొడుకు నాగభూషణం, ఆయన సతీమణి సుబ్బమ్మలకు మా అమ్మ పుట్టింది. తనకు రామయ్య భార్య ఆదిమ్మ పేరుమీద ``ఆదిలక్ష్మి'' అని పేరు పెట్టారు. మా అమ్మ తర్వాత ఇంకా ఇద్దరు కూతుళ్ళు, నలుగురు కొడుకులు పుట్టారు వీళ్ళకు. ఇలానే మా పెద్ద, చిన్న తాతయ్యలకు కూడా ఇలానే చాలా పిల్లలు ఉన్నారు. చిన్నతనంలో మా అమ్మ పుట్టింటిలో ఈ మామయ్యలు, చిన్నమ్మలు, వాళ్ళ పిల్లలతో కాలం అద్భుతంగా గడచింది.

ఊరిలో ఉన్న ఆడపిల్లల స్కూలులో మా అమ్మ 4-వ తరగతి వరకూ చదివింది. అప్పుడు పుస్తకాలు లేవు. పలకా, బలపంతో తెలుగు బాగా నేర్చుకుంది. సుమతీ శతకం, కుమారి, వేమన శతకాలు చదువుకుంది. మా అమ్మ ఎప్పుడూ క్లాసులో మొదటి రాంకులో ఉండేది. కానీ, 5-వ తరగతి చదవడానికి 2 మైళ్ళ దూరంలో ఉన్న వేటపాలెంకు వెళ్ళాలి; అందుకని తనను స్కూలు మాన్పించేశారు.

ఇంగ్లీషు నేర్చుకోవాలని మా అమ్మకు గొప్ప కోరిక. కానీ 4-వ తరగతితో స్కూలు మానెయ్యడం మూలాన చిన్నప్పుడు అది కుదరలేదు. తను గృహిణి అయ్యాక చాలా సార్లు ఇంగ్లీషు అక్షరాలు నేర్చుకోవడం మొదలు పెట్టింది, కానీ, కుటుంబ బాధ్యతల వల్ల అది గొప్పగా ముందుకు సాగలేదు.

3. పెళ్ళి ముందు మా నాన్నగారి కుటుంబ విషేషాలు, అమ్మ నాన్నల పెళ్ళి

ఆ కాలంలో మా నాన్న తాతకు (అంటే నాన్న నాన్న నాన్నకు) ఊరిలో ఏవో తగాదాలు వచ్చాయి. దాంతో ఆయనకు ఊరిమీద కోపం వచ్చి, ఊరు విడిచి పెట్టేశి, మహారాష్ట్రా వైపు తరలిపోయి, బుసావల్ లో సెటిల్ అయ్యాడు. అక్కడ ఆయన నేతపని చేస్తూ, తన కొడుకు స్వామికోటయ్యను (మా నాన్న నాన్నని) చదివించాడు. బాగా చదువుకొని, ఈ స్వామికోటయ్య రైల్వేలో ఉద్యోగం చేసేవాడు. ఆ కాలంలో రైల్వేలో ఆయన జీతం కరెన్సీ నోట్ల బదులు 35 తులాలబంగారంగా ఇచ్చేవారని

ఊర్లో చెప్పుకూనేవారు. ఆయన గార్డుగా చేశేవారట. బండ్రి ఆగిన చోటల్లా ఊరిప్రజలు ఆయనకు ఏవేవో సరుకులు గిఫ్టుగా ఇచ్చేవారట. దీనివల్ల ఆయనకు జీతంగా వచ్చినే బంగారమంతా మిగిలిపోయేదట.

స్వామికోటయ్యకు ఒక కొడుకు ఉన్నాడు. ఈ కొడుకు కూడా తండ్రితోబాటు బుసావల్ లో రైల్వేలో ఉద్యోగం చెశేవాడు. కొడుకుకీ పెళ్ళి అయ్యింది ఒక పందిళ్ళపళ్ళి అమ్మాయితో. ఒకసారి అత్తాకోడళ్ళూ ఇద్దరూ గర్భవతులయి, కాంపులకు పందిళ్ళపల్లి వచ్చి ఉండగా; స్వామికోటయ్యా, అతని కొడుకు ఇద్దరూ బుసావల్ లో ఒక రైల్వే ఏక్సిడెంటులో చనిపోయారు. ఆ సమయంలో స్వామికోటయ్య భార్య పందిళ్ళమ్మ మా నాన్న నారాయణస్వామిని కన్నది. అప్పుడు అత్తా కోడళ్ళిద్దరూ తమ పసి పిల్లల్లలతో బుసావల్ వెళ్ళి, తమ భర్తలు పోగుచేశిన బంగారం కొంత అమ్మి, ఆ డబ్బు, మిగిలిన బంగారంతో పందిళ్లపల్లి తిరిగి వచ్చేశారు.

పందిళ్ళమ్మ బుసావల్ నుంచి తీసుకువచ్చిన డబ్బు, బంగారం చాలా వరకూ అమె అన్నదమ్ముళ్ళు తినేశి, ఆమెను బయటకు గెంటేశారు. అప్పుడు తనదగ్గర దాచుకున్న మిగిలిన బంగారంతో ఇంకొక ఇల్లు పందిళ్లపల్లిలోనే కొనుక్కొని, మా నాన్నను పెంచి, చదివించింది. ఆయన BA చదువు పూర్తిచేశాక, మా అమ్మతో పెళ్ళి చేసింది. పెళ్ళి అయిన వెంటనే ఇంకా కార్యంకాకపోయినా, 8 సంవత్సరాల మా అమ్మను తన ఇంటికి తేచ్చేశుకొంది పందిళ్లమ్మ. అప్పటికి మా నాన్న గారికి ఇరవై సంవత్సరాలు. వీళ్ళ పెళ్ళి 5 రోజులు, పల్లకీ ఊరేగింపులూ, ప్రతిరోజూ విందు భోజనాలతో చాలా ఘనంగా జరిగింది.

మా ఊరిలో మా నాన్న గారే మొదటి BA చదివినవారు. ఛదువు పూర్తి అయిన తర్వాత ఆయన కోర్టులో ఉద్యోగం చెయ్యడం మొదలుపెట్టారు. దీనివల్ల మా అమ్మానాన్నలు పందిళ్ళపల్లిలో నేతవృత్తిని విరమించి ప్రభుత్వోద్యోగాన్ని జీవనోపాధిగా ఎంచుకున్న మొదటి పడుచు దంపతులు అప్పుడు. ఇలా మా తాత నాగభూషణం తన కూతురు ఆదిలక్ష్మికి నేతనేసుకునే భర్త కాకుండా, ఒక ప్రభుత్వోద్యోగిని తెచ్చినందుకు, మా చిన్నమ్మలందరికీ చాలా అసూయ కల్గింది. దీన్ని బయటకు చూపించకపోయినా, మనస్సులో వాళ్ళు ఈర్ష పదుతున్నారని మా అమ్మ గ్రహించింది

తనకు 11 సంవత్సరాల వయస్సు వచ్చినప్పుడు మా అమ్మ రజస్వల అయ్యింది. అప్పుడు కొడుకు కోడళ్లకు కార్యం జరిపించింది మా నాయనమ్మ. మా అమ్మకు 16-వ సంవత్సరం వచ్చినప్పుడు గర్భవతి అయ్యి, ఆ సంవత్సరంలోనే నన్ను కన్నది.

నాకు 3 నెలలప్పుడు, మా ఊరిలో విపరీతమైన గాలివాన ఉరుములు, మెరుపులతో వచ్చింది. మెరపుల మూలాన చాలా ఇళ్లు కాలిపోయాయి, చాలా చెట్లు కమిలిపోయాయి. ప్రజలందరూ ''నిప్పుల వర్షం'' కురిసిందనుకున్నారు. దీని నుంచి తేరుకోడానికి ఊరికి షుమారు సంవత్సరం పైన పట్టింది. ఊరి ప్రజల మెదళ్ళలో ఆ నిప్పుల వర్షం బండగుర్తుగా నిలిచి

పోయింది. ఇప్పటికీ ఊర్లోని ముసలివాళ్ళు నన్ను చూశినప్పుడు, ``నువ్వు పుట్టినప్పుడు నిప్పుల వర్షం కురిసింది బాబూ'' అని చెప్తుంటారు.

నేను పుట్టకముందే మా అమ్మ తన చిన్నాన్న దగ్గర సంగీతం నేర్చుకోవడం మొదలుపెట్టి, స్వరాలూ, కొన్ని త్యాగరాయకృతులూ నేర్చుకుంది. ఎప్పుడూ నేర్చుకున్న పాటలు ఆనందంగా పాడుకుంటూ ఉండేది. అది చూశి మానాన్న తనకు హార్మోనియం కొనిపెట్టారు. ఈ సంగీతశిక్షణ నేను పుట్టిన తర్వాత కొన్నాళ్ళవరకూ సాగింది. కాని తర్వాత మా బాబాయి పాఠం చెప్పడానికి వచ్చినప్పుడు, నేను ఏడ్చి అంతరాయం కల్గించడంమూలాన మా అమ్మ సంగీత శిక్షణ మానెయ్యవలశి వచ్చింది. తనకు అప్పుడు నేర్చుకున్న కొన్ని పాటలు ఇంకా గుర్తున్నాయ్యి. కలుద్దుకున్నప్పుడల్లా నాకు ఆ పాటలు పాడి వినిపిస్తుంది.

మా నాన్నగారికి మొదటి ఉద్యోగం బందరు జిల్లా కోర్టులో నెలకు 45 రూపాయిలు జీతంతో ఉండేది. కుటుంబంతో బందరు నక్కల తోటలో నివసించడం మొదలుపెట్టారు. కోర్టు ఉద్యోగంలో కేసుల్లో గెలిచిన పార్టీలు పారితోషకం ఇస్తుండే వారు. ఇలా వచ్చినే డబ్బులతో నక్కలతోటలో స్థలం కొని ఇల్లు కట్టారు. నక్కలతోటలో మొదటి గృహస్థులలో మా నాన్నగారు ఒకరు. మా ఇల్లు ముందు తాటాకుల గుడిశెగా మొదలయ్యి, తర్వాత పెంకుటిల్లుగా అయ్యి, చివరకు డాబాగా మారింది.

ఆ కాలంలో నక్కలతోట చిన్న పేట. ఏవరి ఇంట్లో పండుగ చేశుకున్నా, పేటలో అందరూ కులబేధాలు లేకుండా భోజనాలకు వచ్చేవారు.

మా ఇంటికి రెందు మైళ్ళ దూరంలోనే చిలకలపూడి పాండురంగడి గుడి ఉంది. మా నాన్నగారి జీతం కుటుంబం భుక్తికి సరిపోయేదికనుక, ఇంట్లొ మా నాయనమ్మకు, అమ్మకు ఖాళీ సమయం ఉండేది. ఈ సమయంలో మా నాయనమ్మ తన కోడలుతో పాండురంగడి గుడికి వెళ్తుండేది. అక్కడ ఒక చక్కటి గోపాలకృష్ణుడి బొమ్మ మా అమ్మకు కొనిపెట్టింది మా నాయనమ్మ. ఈ బొమ్మే మా అమ్మలో ఆధ్యాత్మిక చింతను నాటింది.
ఆ బొమ్మ నుంచీ, నా పుట్టిన రోజు
గోకులాష్టమి అవడం మూలాన, నాపేరు ``గోపాలకృష్ణ మూర్తి'' అని పెట్టింది.

నా చిన్నప్పుడు మా అమ్మే నాకు మొదటి టీచరు. తను ఇంట్లోనే నాకు తెలుగు అక్షరాలు దిద్దించి తెలుగు నేర్పించింది. ఇలానే నా తమ్ముడూ, చెళ్ళెళ్ళందరికీ మా అమ్మే మొదటి టీచరు. తనే శ్రద్ధతో మా అందరికీ చిన్నతనంలో తెలుగు అక్షరాలు దిద్దించి, తెలుగు నేర్పించింది, అంకెలూ, గుణింతాలు, ఎక్కాలూ నేర్పించింది.

మా నాన్నగారి ఉద్యోగం, బందరు నుంచి కైకలూరుకీ, అక్కడ నుంచి విజయవాడకూ మారింది. విజయవాడలో ఉన్నప్పుడు తను చివరసారి గర్భవతి అయ్యింది. అప్పుడు కొందరు స్నేహితురాళ్ళతో కృష్ణా నది చూడడానికి వెళ్ళింది. అప్పుడు ఒడ్డున బోర్లా పడి ఉన్న ఒక పడవ మీద ఎక్కి చూస్తూ, కింద నదిలో పడిపోయి ఊబిలో దిగిపోతుంటే, తన స్నేహితురాళ్ళు చెయ్యి పట్టుకొని లాగి బయటకు తీశారు. తర్వాత తనకు పురుడులో ఇద్దరు కవల కొడుకులు పుట్టారు. పదేళ్ళ తర్వాత, ఈ కవలలలో చిన్న తను నదిలో పడవలో వేళ్తూ, అదే చోటున జారి పడిపోయి మునిగి చనిపోయాడు.

ఆ కాలంలో పొట్టి శ్రీరాములు గారు నిరాహార దీక్షలో మరణించి, ఆంధ్రప్రధేష్ రాష్ట్రం గుంటూరు టెంపరరీ రాజధానిగా ఆవిష్కరించడం జరిగింది. అప్పుడు మా నాన్నగారి ఉద్యోగం కొత్త రాష్ట్రి ప్రభుత్వంలో గుంటూరుకి మారింది.

గుంటూరులో ఒక సంవత్సరం ఉన్నారు. ఆ సంవత్సరంలో మా తమ్ముడి చదువు బాగా సాగలేదు. దీనివల్ల గుంటూరు అచ్చి రాలేదనిపించి, మా నాన్నగారు మళ్ళీ బందరు
మార్పించుకున్నారు.

మా తల్లిదండ్రులకు జరిగిన అనుభవాలలో పిల్లలు తప్పిపోవడం కూడా ఉంది. ఒకసారి మా కుటుంబమంతా బందరుకి దగ్గర్లో ఉన్న పెడనలో ఒకరింటికి లంచికి వెళ్ళాం. భోజనం అయ్యాక, పెద్దలు కబుర్లు చెప్పుకుంటుండగా, పిల్లలు కొందరు ఇంటి బయట ఆదుకోడానికి వెళ్ళారు. ఆ రోజు మా 5 సంవత్సరాల చెల్లెలు సరోజిని ఏమైపోయిందో కనపడలేదు. తను ఆ రోజు ఎర్రటి పంజాబీ డ్రస్సు వేసుకుంది; దాన్ని చూశిన వాళ్ళు, ఈ అమ్మాయి ఎవరో ముస్లిం అమ్మాయి అనుకోవచ్చు. మా అమ్మా, నాన్న ఏడుపు ముఖంపెట్టారు. ఫలువురు పెద్దలు వెతకడానికి అన్ని వైపులా వెళ్ళారు. గంటలు గడిచిపొయ్యాయి, మధ్యాహ్నమల్లా సాయంత్రం అయ్యింది. సూర్యుడు అస్తమించబోయే సమయానికి ఒకాయన ఏడుస్తున్న మా చెల్లెలుతో వచ్చాడు. అంతవరకూ శోకమూర్తిగా ఉన్న మా అమ్మ ముఖంలో అప్పుడుగానీ చిరునవ్వు కనపడలేదు.

ఇలాంటిదే మా నాన్నగారికి హైద్రాబాద్ బదిలీ అయినప్పుడు మళ్ళీ జరిగింది. కుటుంబం హైద్రాబద్ చేరుకున్న రోజునే, పెద్దలు సామాన్లు ఇంట్లో సర్దుతుండగా, పిల్లలు బయట ఆడుకుంటున్నారు. వాళ్ళు ఎలా ఉన్నారో అని మా అమ్మ బయటకు చూశినప్పుడు, నా చిన్న చెల్లెలు గీత కనపడలేదు. కొత్త ఊరు, పిల్ల ఎక్కడకు వెళ్ళిందో అని మా అమ్మ గాభరా పడింది. మా నాన్నగారు పోలీసు రిపోర్టు ఇచ్చి ఒక వైపు చూడాడానికి వెళ్ళారు. స్నేహితులు ఇతర వైపుల్లో వెదకడానికి వెళ్ళారు. ఈ ఆదుర్దాతో 4 గంటలు గడిశాక, ఒకాయన ఏడుస్తున్న మా చెల్లేలితో తిరిగి వచ్చాడు.

మా నాన్నగారు హ ఐద్రాబద్ లో కొన్నాళ్ళు ఉన్న

తర్వాత ఇలానే ఉద్యోగరీత్యా నెల్లూరులకు మారి, నెల్లూరులో రిటైరయి విజయవాడలో సెటిల్ అయ్యారు. దీని తర్వాత కొన్ని సంవత్సరాలలో పిల్లల పెళ్ళిళ్ళ బాధ్యతలు తీర్చి, 1981 లో మా తమ్ముడి గృహప్రవేశానికి హైద్రాబద్ వెళ్ళినప్పుడు మా నాన్నగారు కన్ను మూశారు.

అప్పటినుంచీ, మా అమ్మ ఒంటరిదయిపోయి, విజయవాడలో దైవచింతనతో కాలం గడుపుతూంది.

మా అమ్మకు ఇప్పుడు 89 సంవత్సరాలు. తన జీవితాన్ని గురించి ఆలోచించినప్పుడు, తను ఎక్కడ పుట్టి ఎక్కడ చేరుకుందో తలచుకొని, తృప్తితో, ''ఇదంతా దేవుడికి నా మీద కల్గిన కృపవల్లా, మా పిల్లల చదువులకు మేము చేశిన కృషివల్లనేకదా!'' అనుకుంటుంది.